క్లుప్తంగా

అరిమాను గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అరిమాను గంగమ్మ

పాలసముద్రం : మండలంలోని సింహరాజు పురం గ్రామంలో వెలసిన అరిమాను గంగమ్మ తల్లికి కొలువు మహోత్సవాల భాగంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేపట్టారు. ఉదయం అమ్మవారికి అంబలిపోసి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అమ్మవారి ఆలయం ఎదుట బొమ్మ వేసి హారతులిచ్చారు. సాయంత్రం పొంగుపాలు తోడుట కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



ఆలయ ఆవరణలో వేసిన అమ్మవారి బొమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

వలంటీర్ రాజీనామా



రాజీనామా పత్రాన్ని అందిస్తున్న వలంటీర్

నగరి : టీడీపీ నేతల వేధింపులు తట్టుకోలేక, ముఖ్యమంత్రి జగన్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ నగరి రూరల్ మండలం, తెరణి గ్రామానికి చెందిన వలంటీర్ వినోద్‌కుమార్ రాజీనామా చేశారు. సోమవారం తన రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ రవికుమార్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతల వేధింపులు ఎక్కువయ్యాయని, ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపైనే దాడి చేశారన్నారు. ఇది చాలా బాధాకరమని, సీఎంపై దాడికి నిరసనగా రాజీనామా చేసినట్లు తెలిపారు.

200 లీటర్ల సారా ఊట ధ్వంసం

పెనుమూరు(కార్వేటినగరం): సారా తయారీ కోసం దాచిన 200 లీటర్ల సారా ఊటను పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. ఎస్‌ఐ లోకేష్ కథనం మేరకు.. కామచిన్నయ్యపల్లె పంచాయతీ మిట్టూరు సమీపంలో ఉన్న మామిడి తోటల్లో అక్రమంగా సారా తయారు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. ఈ మేరకు సోమవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 200 లీటర్ల సారా ఊట ధ్వంసం చేశారు. అలాగే సారా తయారీకి వినియోగిస్తున్న పాత్రలు, ముడి సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



పురవీధుల్లో దర్శనమిస్తున్న సీతారాములు

కార్వేటినగరం: టీటీడీ అనుసంధానంగా ఉన్న శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో వెలసి ఉన్న శ్రీసీతాకోదండరాముల స్వామివారి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు శుద్ధి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణ, అర్చన వంటి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం 9.30 నుంచి 10.30 గంటల వరకు వేదపండితులు వేదమంత్రాల నడుమ సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు స్వామి ఆలయ ఆవరణలో వేద పండితులు ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం సీతారాముల వారిని పట్టువస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి 6.30 నుంచి 8.30 వరకు గ్రామ వీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. తిరువీధి ఉత్సవం అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారిని ఏకాంత సేవలో పవళింపచేశారు. ఆలయ అధికారి సురేష్‌కుమార్, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాల సమస్య పరిష్కారం

- రూ.1.08 కోట్ల నిధులతో రోడ్డు ఏర్పాటు చేయించిన మంత్రి రోజా
- ఆనందం వ్యక్తం చేస్తున్న నింద్ర మండలంలోని పలు గ్రామాల ప్రజలు

నింద్ర : నాలుగు దశాబ్దాలుగా నింద్ర మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ, గోవిందప్పనాయుడు కండ్రిగ ఎస్టీ కాలనీ, ఇరుగువాయి, ఇరుగువాయి ఎస్సీ కాలనీ, ఆరూరు, ఆరూరు సెంటరులో నివాసం ఉంటున్న 600లకు పైగా కుటుంబాలు గత నాలుగు దశాబ్దాలుగా రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నారు. ఎంతమంది పాలకులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. అయితే 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడగానే గ్రామీణ రోడ్లకు ప్రాధాన్యత ఇచ్చింది. గడపగడపకు మన ప్రభుత్వంలో కార్యక్రమంలో భాగంగా మంత్రి రోజా పర్యటించినప్పుడు గ్రామస్తులు తమ సమస్యను విన్నవించారు. దీంతో స్పందించిన మంత్రి రోజా ఆయా గ్రామప్రజల కోరిక మేరకు నూతన బీటీ రోడ్డుకు ప్రతిపాదనలు పంపారు. ప్రత్యేక చొరవతో రూ.1.08 కోట్లు నిధులు మంజూరు చేసి సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మించారు.



నూతనంగా నిర్మించిన గోవిందప్పనాయుడు కండ్రిగ రోడ్డు



మరమ్మతులు చేసిన బస్‌షెల్టర్

గతంలో శిలాఫలకం వేసినా..

గత టీడీపీ పాలనలో రూ.56.23 లక్షలు మంజూరు చేసినట్లు ఆర్భాటాలు చేసి భూమిపూజ చేసి శిలాఫలకం వేసినా రోడ్డు పనులు అణువంతైనా ప్రారంభం కాలేదు. మంత్రి ఆర్‌కేరోజా రోడ్డును అందుబాటులోకి తేవడంతో పాటు శిథిలావస్థలో ఉన్న బస్‌షెల్టర్‌కు కూడా మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

మంత్రి రోజా చొరవతో పరిష్కారం..



మా గ్రామ రోడ్డు సమస్యను పరిష్కరించడంలో మంత్రి రోజా చేసిన మేలు మరచిపోలేం. మేము ఉద్యోగం కోసం వేరే ప్రాంతాల్లో ఉన్నా, మా గ్రామానికి రావాలంటే సమస్యగా ఉండేది. ఆ రోడ్డులో వెళ్లి అలిసిపోతాం అంటూ ఊరికి రాకుండా నిలిచిపోయిన సందర్భాలు కూడా ఉన్నారు. నేడు మంత్రి సహకారంతో పక్కా బీటీ రోడ్డు వచ్చింది. తరచూ గ్రామానికి రావాలనిపిస్తోంది.

– రఘు, జీఎన్ కండ్రిగ

ఎంతో ఆనందం..



మా గ్రామ రోడ్డు సమస్య ఎంతోమందికి చెప్పినా స్పందించలేదు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం వారు ఆసక్తి చూపలేదు. మా గ్రామానికి గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా విచ్చేసిన మంత్రి రోజాకు సమస్య చెప్పుకున్నాం. వెంటనే స్పందించిన ఆమె రోడ్డును వేయించారు. ఇక మా ప్రయాణం ఆమెతోనే. మాకు ఆమె చేసిన మేలు మరిచిపోం.

– మధు, జి.ఎన్ కండ్రిగ

చాలా ఇబ్బంది పడేవారు..



మా గ్రామానికి బంధువులు రావాలంటే ఇదివరలో ఇబ్బంది పడేవారు. వర్షాకాలం అయితే గుంతలుగా ఉన్న రోడ్డులో ద్విచక్ర వాహనాల్లో వెళ్లలేక పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇంటికి చేరుకోవడం నరకప్రాయంగా మారేది. ప్రస్తుతం మా రోడ్డు సమస్య పరిష్కారమైంది. మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

– మురళీకృష్ణ, జీఎన్‌కండ్రిగ

బస్‌షెల్టర్‌కు కూడా మరమ్మతులు చేశారు..



మాగ్రామం వద్ద ఉన్న బస్‌షెల్టర్ మరమ్మతులకు గురికావడం వల్ల అక్కడ ఎవరూ నిలబడేకి కూడా ఉండేది కాదు. ఇటీవల మరమ్మతులు చేయడం వల్ల మాకు ఇబ్బంది లేదు. బస్సుల కోసం వేచి చూడడానికి షెల్టర్ ఉపయోగపడుతోంది. మంత్రి సహకారం మరచిపోలేం. ఆమె వెంటే మా గ్రామస్తులంతా ఉంటాం.

– గుణశేఖర్, జీఎన్ కండ్రిగ

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నగరి : మున్సిపల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారి ఆర్డీఓ వెంకటరెడ్డి సోమవారం పరిశీలించారు. కేంద్రాల వద్ద చేపట్టిన ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవకతవకలు ఏర్పడేందుకు వీలు లేకుండా చర్యలు కట్టుదిట్టంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీపీఓ నీరజాక్షి, మున్సిపల్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యలు లేకుండా చూడండి

శ్రీరంగరాజపురం: గ్రామాల్లో నీటిఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల నిబంధనల ప్రకారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో మరమ్మతులకు గురైన చేతి పంపులు, పైపులైన్లను గుర్తించి వెంటనే బాగు చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా పంచాయతీలకు మంజూరైన 15వ వార్షిక ప్రణాళిక నిధులతో నూతన పనులు ప్రారంభించకుండా అత్యవసరమైన తాగునీటి పనులు, మోటార్ మరమ్మతులు, తాగునీటి ట్యాంకుల మరమ్మతుల వంటి వాటికి వెచ్చించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సరిత, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలువురు పాల్గొన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం



కుంభాభిషేక వేడుకల్లో మంత్రి ఆర్‌కే రోజా

- వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఆర్కేరోజా

నగరి : మున్సిపల్ పరిధిలోని అనంతప్పనాయుడు కండ్రిగలో వెలసిన కన్నికలమ్మ ఆలయ కుంభాభి షేక వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆమె హోమపూజల్లో, పూర్ణాహుతి, కుంభారాధన, కుంభ ప్రదక్షిణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కుంభాభిషేకం అనంతరం పవిత్ర అభిషేక జలాన్ని తలపై చల్లుకున్నారు. మహాభిషేకం అనంతరం కన్నికలమ్మను పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించగా మంత్రి దర్శించుకుని కర్పూర హారతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే జగనన్నే రావాలి

- వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో రామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు

పుత్తూరు: గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కొనసాగాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిందేనని తేల్చి చెప్పారు. సోమవారం పుత్తూరు మండలం రామకృష్ణాపురం పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రతి కుటుంబం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి రోజమ్మ నేతృత్వంలో పుత్తూరు మండలంలో పలు అభివృద్ధి జరిగినట్లు తెలిపారు. నగరి నియోజకవర్గంలో అడిగిన ప్రతి పనిని ముఖ్యమంత్రి మంజూరు చేశారని చెప్పారు. ప్రత్యేకించి మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. మనసున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఇందుకు ప్రతి మహిళా సహకరించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు మోసపూరిత వాగ్దానాలను గుప్పిస్తున్నారని చెప్పారు. ఇందుకు పచ్చమీడియా వనిగట్టుకుని ప్రచారం నిర్వహిస్తోందన్నారు. గతంలో తాము చేసిన మంచిని చెప్పి ఓట్లు అడిగే స్థితిలో టీడీపీ లేదని, అందుకే హత్యా రాజకీయాలకు సైతం తెగబడుతున్నారని ఆరోపించారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో మంచి చేయలేని వారు, నేడు ఎలా చేస్తారంటూ ప్రజలే ప్రశ్నించాలని కోరారు. జగనన్న సైనికురాలిగా, మీ ఇంటి ఆడపడుచుగా అహర్నిశలు ప్రజాక్షేమం కోసం పని చేస్తున్న మంత్రి రోజమ్మను నగరి ఎమ్మెల్యేగా రోజమ్మను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ భాస్కర్ యాదవ్, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు గోవిందస్వామిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ సుదర్శన్, నాయకులు మురళీయాదవ్, దేవేంద్రరెడ్డి, గంగాధరం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఓట్లు అభ్యర్థిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హరీష్ యాదవ్, నాయకులు

గంగాధర నెల్లూరు : మరణం లేని గొప్ప మహనీయుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి హరీష్ యాదవ్ అన్నారు. మండలంలోని ఎల్లేరి గ్రామంలో సోమవారం కొత్తగా ఏర్పాటు చేసిన డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, సంఘ సంస్కర్తగా విభిన్న రంగాల్లో అపార ప్రతిభ కలిగిన మహనీయుడు అని కొనియాడారు. అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఆయన ఎంతో కృషి చేశారన్నారు. సమాజంలో పులిలా ఉంటేనే భయపడతారని, మేకలా ఉంటే బలి ఇస్తారని, ప్రజాస్వామ్యంలో ముఖ్య భూమిక పోషించిన ఓటు అనే వజ్రాయుధాన్ని మనకు ప్రసాదించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, జనార్దన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, అంబేడ్కర్ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ ఎం.కృష్ణయ్య, అల్లిముత్తు తలారి అల్లయ్య, దామోదరం, అంజయ్య, బాటయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తిస్తున్న యువకుడికి దేహశుద్ధి

పెనుమూరు(కార్వేటినగరం): ఓ యువతి పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్న యువకుడికి గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన పెనుమూరు మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. పెనుమూరు మండలం నంజరపల్లె పంచాయతీకి చెందిన ఓ యువతి బీటెక్ చదువుతోంది. ఈ యువతి పట్ల కొంత కాలంగా అదే పంచాయతీకి చెందిన పవన్ అనే యువకుడు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. యువతి తల్లిదండ్రులు అమాయకులు కావడంతో ఈ విషయమై పలుమార్లు యువతి గ్రామస్తులు అతన్ని మందలించారు. అయినా వినకపోవడంతో దేహశుద్ధి చేశారు. ఆదివారం రాత్రి ఆ యువకుడు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఈ వియమై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పెనుమూరు పోలీసులు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి



మేళంబాకం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న నియోజకవర్గ పరిశీలకులు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి

- నగరి నియోజకవర్గ పరిశీలకులు మధుసూదన్‌రెడ్డి

నింద్ర: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటయ్యాకే అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టాయని రాష్ట్ర ఉపాధిహామీ పథకం కౌన్సిల్ సభ్యులు, నగరి నియోజకవర్గ పరిశీలకులు మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మేళంబాకం, ఆరూరు పంచాయతీల్లో «మేము సిద్ధం– మా బూత్ సిద్ధం» కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుతో పేదల బతుకుల్లో వెలుగులు నిండాయని, ఆ ఘనత సీఎం జగనన్నదే అన్నారు. అందుకే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే తిరిగి మనం జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ నేతల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. జగనన్నకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. నగరి నియోజకవర్గం అభివృద్ధిలో ముఖ్యమంత్రి జగనన్న సహకారం మరువలేనిదని, అనునిత్యం ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే నాయకురాలు రోజమ్మ అని, వీరిని మరోమారు గెలిపించుకుందామని ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, మండల కన్వీనర్ వేణురాజు, ఎంపీటీసీ సభ్యులు విజేష్, కోఆప్షన్ సభ్యులు అనిల్, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దామోదరం, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణరెడ్డి, ఆరూరు సర్పంచ్ కేశవులు, నాయకులు వీరయ్య, రమణరాజు, మురళీరాజు, మాజీ సర్పంచ్ మునస్వామి, మాజీ ఎంపీటీసీ జయశంకర్, వెంకటరాజు, శరవణ, మోహన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సమీక్ష

- జీడీనెల్లూరు, శ్రీరంగరాజపురం పీఎస్‌లలో తనిఖీలు
- చిత్తూరు జిల్లా ఎస్పీ వీఎన్ మణికంఠ



శ్రీరంగరాజపురం: పోలీసు సేషన్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ

గంగాధర నెల్లూరు: మండలంలోని జీడీ నెల్లూరు పోలీసు స్టేషన్‌ను సోమవారం చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు స్టేషన్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్ స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గరల్స్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు తదితర వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై కేసుల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులు అరెస్ట్ కాని కేసుల్లో నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. నివారణ చర్యలు చేపట్టాలని, అదేవిధంగా రాత్రి, పగటి వేళ బీట్ల పని తీరును నిరంతర మానిటరింగ్ చేయాలని, అప్పుడు నేరాలు తగ్గుతాయని తెలిపారు. అనంతరం స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీసులతో మాట్లాడుతూ వారి ఉద్యోగ బాధ్యతలను వివరించి ప్రజలతో ఎలా మెలగాలనే దానిపై సూచించారు. పోలీసు స్టేషన్ సిబ్బందికి సంబంధించిన సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి డీపీఓలో పెండింగ్ సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని సిబ్బందికి హామీ ఇచ్చారు. తనిఖీల్లో జీడీనెల్లూరు ఇన్‌స్పెక్టర్ మారుతీ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.



జీడీనెల్లూరు: స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ మణికంఠ

శ్రీరంగరాజపురం పీఎస్‌లో..

శ్రీరంగరాజపురం : స్థానిక పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మణికంఠ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుని, డ్రంక్ అండ్ డ్రైవ్ రోడ్డు భద్రతా నియమాలపై యువకులకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో తమిళనాడు, ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో నిఘా పెంచి, రాత్రి వేళ గస్తీ నిర్వహించి శాంతి భద్రతలను పరిరక్షించాలని సూచించారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

నగరి : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నగరి మండల మహిళా సమాఖ్యలో స్వీప్ అవగాహన సదస్సు నిర్వహించారు. సమాఖ్య సభ్యులు క్యాండిల్ వెలిగించి ఓటు విలువను తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఓబీలు, ఈసీ మెంబర్లు, ఏపీఎం, సీసీ, అకౌంటెంట్లు హాజరు కావాలన్నారు.



క్యాండిల్స్ వెలిగించి ఓటు విలువను తెలియజేస్తున్న సమాఖ్య సభ్యులు

సీఎం జగన్‌పై దాడి హేయనీయం



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నగరి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై బస్సు యాత్రలో జరిగిన దాడిని న్యాయవాదులు ఖండించారు. సోమవారం లాయర్ మురళీధర్ ఆధ్వర్యంలో కోర్టు వెలుపల వారు నిరసన వ్యక్తం చేశారు. బస్సుయాత్రలో ప్రచారంలో ఉన్న సమయంలో ఇలాంటి చర్యలకు పాల్పడడం దుశ్చర్య అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై తప్పక చర్యలు తీసుకుని శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రవీంద్ర, ఉదయభాను, జి.బాబు, నాగరాజు, మోహన్, మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.